


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అర్థాంగి

**తలుపు తీసిన భార్యని** చూసి రాజారావు ముఖం వెగటుగా పెట్టి లోపలికి నడిచాడు. అతని చేతిలోని బ్రీఫ్‌కేస్‌ని అందుకుంది ఊర్మిళ.

"ఏమిటి రాజా అలా ఉన్నారు?" అతని వాలకం చూసి ఆదుర్దాగా అడిగింది. పెదవులకి, కనురెప్పల మీద బుగ్గలకి గులాబీ రంగు కనుబొమలు విల్లుగా కిందికి గీసి ఉంటే, కనురెప్పలు విసనకర్రల్లా వెనక్కి వంచి మస్కరా వేయబడ్డాయి. గాడీగా ఉన్న ఐ మేకప్, కనీకనిపించని చిన్న నల్లబొట్టు. జీన్స్ పాంట్ మీద చేతులు లేని కుర్తా. స్వల్పంగా కనిపిస్తున్న చిరుబొజ్జ. నలభైఐదేళ్ళ ఊర్మిళ ముప్పై ఐదేళ్ళ యువతిలా కనిపించడానికి చేసిన విఫల ప్రయత్నం కనిపిస్తోంది. ఘాటుగా సెంట్ వాసన.

"అలసిపోయినట్లున్నారు ఉండండి కాఫీ తెస్తాను." హడావిడిగా వంటింట్లోకి నడిచింది ఊర్మిళ.

"ఎక్కడికో వెళ్తున్నట్లున్నావ్?" ప్రశ్నించాడు రాజారావు.

"తాజ్ కృష్ణాలో నగల ఎగ్జిబిషన్ ఉందిట. మన డాలీకి మంచి నెక్లెస్ కొనాలనుకుంటున్నాం కదా వెళ్ళి చూద్దామని" నసిగింది ఊర్మిళ.

"సరే వెళ్ళు" అలసటగా సోఫాలో జారిగిలపడ్డాడు రాజారావు. ఐదు నిమిషాల్లో కాఫీ కప్పుతో వచ్చింది ఊర్మిళ. ఒక్క గుక్క తాగి ఆమె వైపు చూసి చెప్పాడు.

"పౌడర్ వాసన."

"అయ్యో! ఒక్క నిమిషం"

అతని చేతిలోని కప్పుని అందుకుని సింక్‌లో పారబోసి చేతులు శుభ్రంగా కడుక్కుని మరో కప్పులో కాఫీ కలిపి ట్రేలో తీసుకువచ్చి ఇచ్చింది. అతను కొంచెం తాగేదాకా ఆగి తర్వాత లోపలికి నడిచి హేండ్ బాగ్‌తో బయటకి వచ్చి భర్తని సందిగ్ధంగా అడిగింది.

"పోనీ మానేయ్‌నా? మీరు ఒకే కదా?"

"తయారయ్యావుగా వెళ్ళు. కొంచెం తలనొప్పి. కాఫీ తాగాక పోయిందిలే" పేపర్ అందుకుంటూ చెప్పాడు రాజారావు.

"మా రాజా బంగారం" అతని బుగ్గమీద సుతారంగా ముద్దు పెట్టుకుని బయటకి నడిచింది ఊర్మిళ.

చెంపకి అంటుకున్న లిప్‌స్టిక్‌ని గట్టిగా తుడుచుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు రాజారావు.

●●●

ముప్పై తొమ్మిదేళ్ళ దాకా బాగానే ఉంది ఊర్మిళ. సగటు మధ్యతరగతి తెలుగు స్త్రీలా కట్టు బొట్టు, ఫిగర్ మెయిన్‌టెయిన్ చేయడం మీద అనాసక్తి... చాలా సహజంగా, సాధారణ ఇల్లాలులా ఉండేది.

ఊర్మిళ నలభైయవ పుట్టినరోజునాడు మొదటి షాక్ తగిలింది రాజారావుకి. పంజాబీ డ్రెస్‌లోని ఊర్మిళ నిద్రలేపి మరీ అడిగింది.

"ఎలా ఉన్నాను? బావున్నాను కదండీ."

"ప్రశ్న నీదే సమాధానమూ నీదే. ఇంతకీ ఈ అవతారం ఏంటి?" నవ్వుతూ అడిగాడు రాజారావు.

"పుట్టినరోజు నాడు నన్ను హర్ట్ చేయకూడదు అవతారం కాదు. ఇకనుంచి నేను చుడీదార్లే వేసుకుందామని డిసైడై పోయా" అద్దంలో మురిపెంగా చూసుకుంటూ చెప్పింది ఊర్మిళ.

సరదాపడి ఆ ఒక్కరోజుకే ఆ దుస్తులు వేసుకుంది అనుకున్నాడు రాజారావు. కానీ ఆ తర్వాత ఊర్మిళని చీరలో చాలా అరుదుగా చూస్తున్నాడు. ఆ డ్రెస్‌లో ఆమెతో బయటకి వెళ్ళడానికి చాలా ఇబ్బందిగా అనిపిస్తోంది అతనికి. మొదటినుంచీ లేని ఈ సరదా ఏమిటో అసలు అర్థంకాలేదు.

"ఏమండీ ఓ కోరిక కోరతాను. తీరుస్తారా?" ఓ రోజు గోముగా అడిగింది. "ఏమిటి? పంజాబీ డ్రెస్‌లు బోర్ కొట్టాయా? మళయాళీ డ్రెస్‌లు వేసుకుంటావా?"

"వెటకారాలు వద్దు. మీకు సంబంధించిన కోరిక. ప్లీజ్." బతిమాలింది ఊర్మిళ.

"సరే చెప్పు"

"మీ జుట్టుకి డై వేసుకుంటారా? నల్ల జుట్టుతో టీ షర్ట్ వేసుకుంటే మీరు ఎంత యంగ్‌గా కనిపిస్తారో తెలుసా? " జంకుగానే అడిగింది.

ఫక్కున నవ్వాడు రాజారావు తర్వాత తెల్లటి తన జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి దువ్వుకుంటూ చెప్పాడు.

"నేను గౌరవనీయమైన ప్రొఫెసర్ని ఊర్మీ. నల్ల జుట్టు టీ షర్ట్‌లతో కాలేజ్‌కి వెళ్ళడానికి స్టూడెంట్‌ని కాదు"

"మీరు ఎంత ప్రొఫెసర్ ఐనా మీ వయసెంత? నలభై ఐదేళ్ళేగా నా కంటే ఐదేళ్ళే పెద్దయినా నా పక్కన చాలా ఓల్డ్‌గా కనిపిస్తున్నారు తెలుసా? ఈ తెల్ల జుట్టు మూలంగానే."

"నిజమే కానీ ఈ తెల్ల జుట్టు నా ముప్పై ఐదో ఏట నుంచి ఉంది. పదేళ్ళుగా దీనికి అలవాటైపోయాను సారీ. వేషం మారిస్తే స్టూడెంట్స్ తాటాకులు కడతారు. "

అతనంత గట్టిగా చెప్పాక ఊర్మిళ మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురాలేదు. కానీ మంత్రం వేసినట్లుగా ఆమె చీరలన్నీ మాయమై వార్డ్ రోబ్‌లో రకరకాల డ్రెస్‌లు చోటు చేసుకున్నాయి. భార్యలోని మార్పుని అయిష్టంగానే ఆమోదించాల్సి వచ్చింది. రాజారావుకి. పైగా కూతురి సపోర్ట్ ఉంది. డాలీ ముందు పల్చబడటం అతని ఇష్టం లేదు.

రాజారావుతో కలిసి చదువుకున్న మిత్రుడు అతన్ని తన కొడుకు పెళ్ళికి ఆహ్వానించాడు. అతని భార్యని, కూతుర్ని తీసుకుని తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పారు. డాలీ ఆసక్తి చూపించలేదు. 'అక్కడ నాకెవరూ తెలీదు. నాన్న నేను రాను అమ్మని తీసుకెళ్ళండి' చెప్పింది.

"నాకూ ఎవరూ తెలీదు. యూనివర్సిటీలో కలిసి ఆయన శుభలేఖ ఇచ్చాడట. నాన్న ఒక్కర్నే వెళ్ళమంటూటే వినడం లేదు. ప్లీజ్ నువ్వూ రాలే. కాస్త తోడుంటావు" బ్రతిమాలింది ఊర్మిళ.

"సారీ అమ్మా నేను రాను" నిష్కర్షగా చెప్పింది డాలీ.

భార్యతో పెళ్ళికి వెళ్ళిన రాజారావుని స్నేహితుడు ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"ఏరా! మీ ఆవిడ రాలేదే? పోన్లే మీ అమ్మాయినైనా తీసుకొచ్చావు. అంతవరకూ నయం" ఆనందంగా చెప్పాడు.

"తను నా కూతురు కాదు. నా భార్య ఊర్మిళ" పరిచయం చేసాడు రాజారావు.

"ఓ సారీరా. సారీ అమ్మా" నొచ్చుకున్నాడా మిత్రుడు.

భార్యవైపు చూసాడు రాజారావు. ఆకుపచ్చరంగు పట్టు చుడీదార్, నుదుట చిన్ని నల్లబొట్టు, లైట్ మేకప్‌తో ఊర్మిళ నిజంగానే చిన్న పిల్లలా ఉంది. ఆమె మొహం ఆనందంతో కళకళళాడి పోయింది.

వచ్చేప్పుడు దారిలో ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్న భార్యని చూసి ఉక్రోషంగా అడిగాడు.

"ఎందుకా నవ్వు?"

"నన్ను మీ కూతురు అనుకున్నారు. "విశాలంగా నవ్వుతూ చెప్పింది ఊర్మిళ.

"నువ్వు ఆ హెయిర్ డై మానేయ్.. పెళ్ళాం అనుకుంటారు" కసిరాడు.

"మీరు వేసుకోవచ్చుగా?"

మౌనంగా కారుని ముందుకి పోనించాడు రాజారావు.

●●●

అమెరికాలో యం.ఎస్ చదువుతున్న డాలీ కాన్వొకేషన్ రావాల్సిందే అని పట్టుబట్టింది. రాజారావుకి ఎగ్జామ్స్ ఉండటంతో ఊర్మిళ ఒక్కటే వెళ్ళింది. మూడు నెలల తర్వాత ఆమెని రిసీవ్ చేసుకోవడానికి ఏర్‌పోర్ట్‌కి వెళ్ళిన రాజారావుకి రెండో షాక్ తగిలింది. చుడీదార్ స్థానంలో జీన్స్ పేంట్, టీ షర్ట్‌లో దిగింది ఊర్మిళ.

"ఏమిటీ వేషం?" నుదురు చిట్లించి అడిగాడు.

"బాగున్నా కదూ? డాలీ కొనిచ్చింది. చుడీదార్లు వేసుకోడానికి నాకింకా వయసుందిట. ఏభైదాటాక వేసుకోవచ్చని చెప్పింది డాలీ. "సంబరంగా చెప్పింది.

కారెక్కాక భర్త చేతిని పట్టుకుని చెప్పింది. "అబ్బ! అమెరికా అద్భుతంగా ఉంది కానీ మీరు నా పక్కన ఉంటే ఇంకా అత్యద్భుతం రాజా"

ఆమె స్పర్శ సుఖాన్ని అనుభవిస్తున్న రాజారావు ఉలిక్కిపడి అడిగాడు.

"కొత్తగా ఈ రాజా ఏమిటి?"

"అమెరికన్స్ మనలా ఏమండీ, ఊర్మీ ఇలా పిలుచుకోరు తెలుసా?"

"మన పేర్లు వాళ్ళెందుకు పిలుచుకుంటారు?"

"అబ్బా! అది కాదండీ. భార్యాభర్తలు ఒకరినొకరు హనీ, డార్లింగ్, డియర్.. ఇలా పిల్చుకుంటారు. నాకు నచ్చింది. అందుకనే మీ పేరు రాజారావు కాబట్టి రాజా అనే పిలుస్తా ఇకనుంచీ"

చేదు మింగినట్లుగా మొహం పెట్టి మౌనంగా ఉండిపోయాడు రాజారావు.

●●●

ఫోన్ మోగడంతో ఈ లోకంలోకి వచ్చాడు రాజారావు. అవతలి వైపు అతని రేవతి అక్కయ్య.

"ఏరా బిజీగా ఉన్నావా?" పలకరించారు.

"లేదు. ఏదో పరధ్యానంగా ఉంది.. వినిపించుకోలేదు."

"పరధ్యానం?" తమ్ముడి మాటల్లో ఏదో అలజడిని గుర్తించింది రేవతి.

"చిన్నా ఆరోగ్యం బానే ఉంది కదా? ఊర్మిళ ఏం చేస్తోంది?" అడిగింది.

"ఏదో నగల ఎగ్జిబిషన్‌కి వెళ్ళింది."

●●●

లోపలికి అడుగుపెడ్తున్న తమ్ముడ్ని నవ్వుతూ ఆహ్వానించింది రేవతి.

"రారా.. నాకు తెలిసి నీకు సమస్యలేం లేవు. మరి పరధ్యానం ఎందుకు?"

నిర్లిప్తంగా నవ్వాడు రాజారావు.

"చిన్నా ఎనీథింగ్ సీరియస్?" చురుగ్గా చూస్తూ అడిగింది.

"ఏం లేదక్కా"

అతని చేతిని పట్టుకుని మృదువుగా చెప్పింది.

"అమ్మా నాన్న వెళ్ళిపోయారు చిన్నా! చిన్నప్పుడు మనకి రహస్యాలే ఉండేవి కాదు. పెద్దయ్యాక కొన్ని కొన్ని దాచాం. కానీ మనిద్దరమే కదా మిగిలింది? నాకు చెప్పుకోకూడని రహస్యాలు నీకున్నాయంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. నేను డాక్టర్ని కూడా కదా. చెప్పు ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా?"

ఆ స్పర్శకి రాజారావు కదిలిపోయాడు.

"ఊర్మిళతో చాలా చిరాగ్గా ఉంటోందక్కా..."

ఎదురు ప్రశ్నలు వేయకుండా మౌనంగా అతను చెప్పేదంతా విని రేవతి దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఊర్మిళ నిన్ను నిర్లక్ష్యం చేస్తోందా?" అడిగింది.

"లేదు. నా పనుల విషయంలో చాలా శ్రద్ధగా ఉంటుంది."

"నీ మీద ప్రేమ తగ్గిందనుకుంటున్నావా? "

ఓ నిమిషం ఆలోచించి జవాబు చెప్పాడు.

"లేదు. నాకు ప్రేమని వ్యక్తం చేయడం రాదు. కానీ ఊర్మిళ అలాకాదు. తన ప్రతిమాట, చర్యల్లో నామీద ప్రేమ కనపడుతుంది."

కొద్దిగా సందేహిస్తూ అడిగింది రేవతి.

"తనకి కొత్తగా ఎవరైనా బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడేమో అని అనుమానంగా ఉందా?"

"ఛ..ఛీ! అలాంటు ఊహ నాకెప్పటికీ రాదు"

"మరి నీ సమస్య ఏమిటి?"

"తన కుర్రవేషాలు నచ్చడం లేదక్కా. కొత్తగా జీన్స్, టీ షర్ట్ వేస్తోంది. తనతో బయటకి వెళ్ళాలంటే నాకు ఎబ్బెట్టుగా ఉంటోంది. సినీస్టార్‌లాగా మేకప్ వేసుకుని రంగస్థల నటిలాగా కనిపిస్తోంది నాకు. వద్దని గట్టిగా చెప్పామంటే సున్నితమైన విషయం. పైగా నా సంస్కారం నన్నల్లా మాట్లాడనివ్వరు. టార్చర్ అనుకో" అలసటగా వెనక్కి వాలాడు రాజారావు.

"చిన్నా! ఇది ఒక మానసిక సమస్య. కొందరు ఆడవాళ్ళలో నలభైల్లోకి రాగానే తాము వృద్ధులమైపోతున్నామన్నామనే కాంప్లెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఆడపిల్లలు ఉన్న తల్లుల్లో కూతురు ఎదిగి తనకళ్ళముందు తిరుగుతూంటే, తను చాలా ముసలిదాన్నయ్యానని త్వరలో అల్లుడు, మనవళ్ళు వచ్చి ఇంకా ఓల్డ్ అయిపోతామనే అభద్రతా భావం ఉంటుంది. దానికి తోడు ఎర్లీ మెనోపాజ్ టైమ్‌లో హార్మోన్ల హెచ్చు తగ్గులతో వాళ్ళు చాలా అశాంతికి లోనవుతారు. దాంతో తమకి తెలియకుండానే యవ్వనంలో ఉన్నట్లుగా కనిపించాలని డ్రెస్సింగ్, మేకప్ మార్చేస్తారు. ఉదాహరణకి శ్రీదేవి. తను హీరోయిన్‌గా ఉన్న టైంలో షూటింగ్స్‌లో ఎలా ఉన్నా బయట చాలా పద్ధతిగా డ్రెస్ చేసుకునేది. ఇప్పుడు ఇద్దరు టీనేజ్ కూతుళ్ళతో సమానంగా తయారవుతోంది. ఊర్మిళది కూడా అలాంటి మానసిక సమస్యే. ఇందులో నువ్వు బాధపడటానికి ఏమీ లేదు. కాకపోతే ఆ మార్పుని నువ్వు జీర్ణం చేసుకోలేకపోతున్నావు అంతే" అనునయంగా నవ్వింది రేవతి.

"నేను వెళ్తానక్కా" లేచి నిలబడ్డాడు రాజారావు.

"అర్థమైంది నా మాటలు నీకు నచ్చలేదు. కానీ ఇందులో నువ్వింత ఆందోళన పడాల్సిన అవసరం లేదు చిన్నా. ఊర్మిళని హర్ట్ చేయకు" వెనక నుంచి చెప్పింది రేవతి.

●●●

"ఎక్కడికి వెళ్ళారు? ఫోన్ కూడా వదిలేసి వెళ్ళారు. అబ్బ! ఎంతకంగారుపడ్డానో తెలుసా?" ఆందోళనగా ఎదురువచ్చి అడిగింది ఊర్మిళ.

"అక్కయ్య రమ్మని ఫోన్ చేస్తే వెళ్ళాను" పొడిగా చెప్పాడు రాజారావు.

"అయ్యో! నాకు ఫోన్ చేసి ఉంటే అటునుంచి అటే వచ్చేదాన్నికదా? నేనూ వదినని చూసి చాలా రోజులైంది" నొచ్చుకుంది ఊర్మిళ.

సమాధానం చెప్పకుండా మంచం మీద వాలిపోయాడు రాజారావు.

"అదేంటీ పడుకున్నారా? మీకిష్టమని సబ్ వే నుంచి ఫుట్‌లాంగ్ తెచ్చాను. కొంచె తిని పడుకోండి" చెప్పింది ఊర్మిళ.

"వద్దు అక్కర్లేదు.." మరో మాట మాట్లాడకుండా గోడ వైపు తిరిగి పడుకున్నాడు రాజారావు.

●●●

ఏవో మాటలు అస్పష్టంగా వినబడుతూండటంతో మూసుకుపోతున్న కళ్ళని బలవంతంగా తెరిచి చూసాడు రాజారావు. ఒళ్ళంతా నొప్పులుగా ఉంది మంచం పక్కనే స్టూల్ మీద కూర్చున్న రేవతిని చూసి ఆశ్చర్యపోయాడు.

"అక్కా! నువ్వేంటీ ఈ టైమ్‌లో?"

బదులుగా నవ్వింది రేవతి.

"ఈ టైం లో కాదు బాబూ! రెండురోజులనుంచీ నన్ను ఇల్లు కదలనివ్వలేదు నీ యంగ్ వైఫ్."

"రెండు రోజులా?" నిర్ఘాంతపోయాడు రాజారావు.

"అవును. మా ఇంటినుంచి వచ్చి ఏమీ తినకుండా పడుకున్నావుట. మర్నాడు నిద్రలేపుదాం అని ఊర్మి వచ్చి చూస్తే ఒళ్ళు కాలిపోతూందిట. వెంటనే నాకు ఫోన్ చేసి ఒకటే ఏడుపు. నేను కంగారు పడి గబగబా వచ్చాను. ఏంలేదు వైరల్ ఫీవర్. దానికి తోడు కొంచెం బి.పి స్టేబుల్‌గా లేకుండా ఫ్లక్చుయేట్ అయింది. ఆ మాట చెప్పానో లేదో ఇక ఊర్మిళ నన్ను కదలనివ్వలేదు. బావకి ఫోన్ చేసి రిక్వెస్ట్ చేసి నన్ను ఇక్కడే ఉంచేసింది. నిజంగానే బాగా కంగారుపెట్టావులే. పిచ్చి కలవరింతలు, అరుపులు. ఈ పిల్లేమో ఏడుపులు అబ్బబ్బ!" అలసటగా నిట్టూర్చింది రేవతి.

మంచం పక్కనే నేలమీద కూర్చుని తనవైపు ఆనందంగా చూస్తున్న ఊర్మిళని చూసాడు రాజారావు. పీక్కుపోయిన మొహం, పాపట్లో తెల్లబడ్డ వెంట్రుకలు, ఎలాంటి మేకప్ లేకపోవడం వల్ల వర్ణవిహీనంగా ఉన్న పెదవులు, బుగ్గలు, కళ్ళు భర్త మంచం పక్కన కూర్చున్న ఊర్మిళ వయసు పదేళ్ళు పైబడ్డట్లుగా ఉంది. రూపంలో తేడా ఉన్నా, ఆమె కళ్ళల్లోని తన మీద ప్రేమ మాత్రం ఎలాంటి తేడాలేకుండా, ఇంకాస్త ఎక్కువగా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

చిన్నగా నవ్వి నీరసంగా కళ్ళు ముసుకున్నాడు రాజారావు.

"రాజా!" ఆందోళనగా పిలిచింది ఊర్మిళ. కళ్ళు తెరిచి ఎప్పటిలా ఆ సంబోధనకి చిరాకు పడలేదు రాజారావు. కళ్ళు తెరిచి ఆమెవైపు ప్రేమగా చూసాడు.

"నేను బానే ఉన్నానక్కా. బావకి ఇబ్బందేమో? ఇక నువు వెళ్ళు" అని ఆప్యాయంగా అక్కతో చెప్పాడు. తర్వాత భార్యవైపు తిరిగి చెప్పాడు.

"ఊర్మీ వెళ్ళి స్నానం చేసి నీట్‌గా తయారైరా. నిన్నిలా చూడాలంటే బావుండలేదు. అప్పటిదాకా అక్క ఉంటుందిలే నా దగ్గర"

అర్థమైందన్నట్లుగా నవ్వింది రేవతి.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story